బ్రతుకు తెరువు

"ఎంత పెద్ద ఇల్లే అమ్మా!" ఏడేళ్ళ వెంకటేశు తల్లి కొంగు పట్టుకొని గేట్లోంచి వస్తుండగా ఆశ్చర్యంగా అన్నాడు పెద్ద పెద్ద కళ్ళు తెరుస్తూ. "ఇల్లనరురా దీని, అపార్టుమెంటు అంటారు. వారం రోజులుగా అక్కడ పనిచేస్తున్న మల్లమ్మ తను నేర్చుకున్న ఆ మాట కొడుక్కి చెప్పింది. ఇది ఒక ఇల్లు కాదురా, యిక్కడ నలభై ఇండ్లున్నాయిట. ఇట్లా అన్నీ కలిపి కట్టిందానిని అపార్టుమెంటు అంటారుట. ఇలాంటివి ఈ ఐదరాబాదలో వేలున్నాయట" ఎంతో తెల్సినట్టు విడమర్చి చెప్పింది.

'నీవీడనే పనిచేస్తండవా' కొడుకు ఆనందంగా అడిగాడు. ఒకటేటి, మూడిల్లల్లో సేస్తండ. మన భూదేవి పిన్నమ్మ పని కుదిర్చిందిగా. పిన్నమ్మ కొడుకు యీడనే ఎప్పుడూ పనిసేస్తడు. అదేగా, ఆల్లమ్మకి మనిషి కావాలని సెపితే పిన్నమ్మ నన్నట్టుకొచ్చి కొలువులో పెట్టింది.

మాటల్లో ఇప్పుడు దగ్గిరకొచ్చింది మల్లమ్మ. అక్కడ గోడకున్న ఎర్ర బల్బుని వత్తింది. జర్రున పైనెనించి ఓ బోనులాంటిది కిందకి జారుకుంటూ రావడం, అందులో బల్లమీద కూర్చున్న యాదగిరి 'ఏంటక్కా యీడ్ని ఎంటేసుకొచ్చావియాళ' అని పలకరిస్తూ 'ఏట్రా అట్లా గుడ్లు మిటకరించి సూస్తున్నావు. గమ్మున లోపలికిరా' చేయి పట్టి లాగి తలుపు మూసి ఎర్ర బటను నొక్కాడు. 'సూసావా, ఎలా జర జర పైకి పోతుందో, మెట్లెక్కి రానక్కరలే, ఇదే తీసకపోతది. గొప్పగా అందులో కూర్చుని పని చేయడం చాలా గొప్ప పని అన్నట్లు గర్వంగా అన్నాడు యాదగిరి. జర్రున పైకి తోడేసింది లిఫ్టు. తలుపు తెరిచి ఎంకటేసు నెత్తి జెల్లకాయ కొట్టి 'నోరుమూయరా ఎదవా ఈగలెల్లిపోగలవు నోట్లోకి.' నోరెళ్ళపెట్టి చూస్తున్న వెంకటేసుతో హాస్యం

ఆడాడు. కొడుకు చేయి పట్టుకొని ఓ గుమ్మందగ్గిర కెళ్ళి బెల్ కొట్టింది మల్లమ్మ. తలుపు తీసినావిడ 'ఏమిటి వీడెవడు, నీ కొడుకా లోపలికెందుకు ఆ మెట్ల మీద కూచోబెట్టు' అంది కాస్త మొహం అప్రసన్నంగా పెట్టి.

"ఈ పొద్దుకి రానీ తల్లి, అంతా కొత్త, ఎనకాతల గిన్నెలు తోమేకాడ కూకోపెడతాను. రారా" అంటూ తీసికెళ్ళి వంటింటిదగ్గర బాల్కనీలో కూచోబెట్టింది. గబగబా చీపురు పట్టుకుని "యీడనే కూకో అమ్మ 'చా' ఇస్తుంది తాగిపిస్తా. నా వెంట వురక్కు" అంటూ లోపలికెళ్ళింది. ఇల్లు వూడ్చి వచ్చి బకెట్‌లో నీళ్ళు, గుడ్డ పట్టుకుని మళ్ళీ వెళ్ళి ఇల్లు తుడిచి వచ్చింది. వంటింట్లో పనిచేసుకుంటున్న ఇంటామె 'ఏమిటి' వాడిని స్కూలుకి పంపరాదా, నీ వెంట తిప్పుకుంటావెందుకు' అంది టీ చేసి ఓ పాత గ్లాసులో పోసి ఇస్తూ.

"ఏదమ్మా ఊరు కొత్త గందా, బడి ఏడుంతో సూడాలి, నాలుగు డబ్బులు చేతిలో పడాలి. ఏసంకాలం శలవులయ్యాక బడిలో సేర్చమన్నారు మావోళ్ళు." గ్లాసులో సగం టీ ఓ విరిగిన కప్పులో సగం పోసి కొడుక్కిచ్చి, తను తాగింది. తరువాత అంట్ల గిన్నెలన్నీ పోగేసి గబగబా తోమి గంపలో బోర్లించింది. గిన్నెలయ్యాక నానబెట్టిన బట్టల బకెట్ తీసుకొచ్చి బ్రష్ పెట్టి ఉతక సాగింది. 'అమ్మా యాదగిరి మామకాడి కెళతానే' అన్నాడు. 'వద్దురా, నీవీడే కూర్చో, పని కాంగానే ఎళదాం యిదిగో యీ బట్టలు గుంజినాక పని అయిపోతాది' అంటూ బట్టలు గబగబా పిండి ఆరేసింది. గంటన్నరలో పనిచేసి రెండో అంతస్థులో ఇంకో యింటికి వెళుతూ మధ్యలో లిఫ్టు దగ్గర ఆగి "తమ్ముడూ యీడిని కాస్త నీకాడ కూకుండబెట్టుకోరా ఆ మార్వాడమ్మ లోపలికి తీసికెళితే అరుస్తుంది." అలాగే! నీవు పో. నాకాడుంటాడులే యీడు' అని లోపలికి లాగి స్టూలు మీద కూర్చోబెట్టి యీ కబురూ ఆకబురూ చెప్పసాగాడు. కానీ ఎంకటేసుకి మాత్రం లిఫ్టులో కూర్చోడం అది పైకి కిందకి వెళుతుంటే బలే గమ్మత్తుగా వుండి మొహం చింకి చాటంత చేసుకుని కూర్చున్నాడు. ఓ గంట తరువాత తల్లి పనిచేసుకు వచ్చి 'పద కిందకి ఇంటికి పోవాల' అంటూ మొదటి అంతస్థులో యింకో యింటికి తీసుకెళ్ళి 'ఇంద ఈ రొట్టి తింటూ ఆ మెట్లకాడ కూచో... ఏడికీ పోవద్దు. గమ్మున కూర్చో జాగ్రత్త' అంటూ ప్లాస్టిక్ కాగితంలో చుట్టిన పరోటా వాడి చేతిలో పెట్టి వెళ్ళింది. ఆ మెట్ల మీద కూర్చుని వచ్చి పోయేవారిని, లిఫ్టులో ఎక్కేవారు దిగేవారు స్కూలు పిల్లలంతా రంగు రంగుల యూనిఫారాలు తొడిగి భుజాన పుస్తకాల సంచులు, చేతిలో టిఫిను బుట్టలు

పట్టుకుని స్కూలుకి వెళ్ళడం, కింద ఆటోవాళ్ళు, పేపరు వాళ్ళు, కింద నుంచే తాగే నీరు తెచ్చే పనివాళ్ళు అంతా హడావిడి. అదో చిన్న ఊరులా వుందనిపించింది ఎంకటేసుకి. తల్లి మధ్యలో ఓసారి వచ్చి మెట్లమీద కూర్చుని తానొకటి తిని వాడికొకటి తెనిపించింది. గ్లాసులో టీ సగం తను తాగి సగం వాడికిచ్చింది. 'అమ్మా నేను స్కూలు బోతనే' అన్నాడు స్కూలు పిల్లలని చూపించి. 'పోదువులే స్కూలు శలవలయ్యాక మొదలెట్టాక పోదువులే రేపటికాడ నించి పలక బలపం తెచ్చుకుని యాదగిరి మామకాడ కూకుని అచ్చరాలు రాపించుకో' అంది లోపలికి వెళుతూ.

మల్లమ్మ మూడిళ్ళలో పని పూర్తిచేసి బయటికి వచ్చేసరికి పదకొండున్నరయింది. చేతిలో స్టీలు డబ్బా పట్టుకుని వచ్చి 'పద పోదాం యింటికి' అంది. అక్కడికి ఓ ఫర్లాంగు దూరంలో వుంది మల్లమ్మ యిల్లు. ఇల్లంతా ఓ చిన్ని గది. వెనక పంచదించిన చోట గోడ అడ్డం పెట్టిన చోట వండుకునే చోటు. మరో పక్క మనిసి పట్టేంత చిన్న స్నానం గది. ఆ బస్తీ ఆ సందుకి వున్న పన్నెండిళ్ళకి కలిపి కామన్ లెట్రిన్లు రెండున్నాయి. అక్కడికి పోవాలి బాల్చా నీళ్ళు పట్టుకుని. ఆ గదే ఐదువందల బాడుగ. ముప్పై రూపాయలు కరెంటు బల్బుకి. పదిహేను రూపాయలు నీళ్ళకి పుచ్చుకుంటుంది ఇంటామె. ఈ యిల్లు, ఈ కొలువు పింతల్లి భూదేవి పుణ్యాన దొరికాయి అనుకుంటుంది మల్లమ్మ. లేకపోతే తనగతి ఏమయ్యేదీ ఆ పల్లెలో కొడుకుని పెట్టుకుని తిండిగింజలు లేక మాడాల్సి వచ్చేది అనుకుంటుంది. భూదేవి పిన్నికి ఆ బస్తీలోనే చిన్న యిల్లుంది. రెండు గదులు, వంటిల్లు. కొడుకు కోడలు చిన్నకొడుకు యాదగిరి వుంటారు. ఇంటికి నల్లా (పంపు) వుంది. పంకాలున్నాయి. టి.వి. వుంది. కొడుకు గవర్నమెంటు నౌకరి. కోడలు బ్యాంక్‌లో అటెండరు. భూదేవి నాలుగిళ్ళలో పనిచేస్తుంది. యాదగిరి బిల్డింగులో లిఫ్టు బాయ్ అంతా కలిసి సంపాదించి దర్జాగా వుంటారు.

మల్లమ్మ మొగుడు కొమరయ్య నాలుగు నెలల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లమ్మ కొమరయ్యది మహబూబ్‌నగర్ టజల్లాలో అచ్చంపేట. రెండకరాల భూమున్న రైతు. పొలాన్ని, పంటని నమ్ముకున్న చిన్నకారు రైతు. గత ఐదేళ్ళుగా రైతుల కడగండ్లు మొదలయ్యాయి. వర్షాభావం, నకిలీ విత్తనాలు, కల్తీమందులు, విపరీతమైన ఎరువుల ధరలతో రైతుల నడుం విరిగింది. గత మూడేళ్ళ వర్షాలు లేక, భూమిలోని నీరింకి, అప్పులు తెచ్చి మూడు చోట్ల వేయించిన బోర్ బావులు ఖర్చు ఎవరు తవ్వుకున్న గోతిలో వారే పడ్డట్టయింది. రైతుల కథలు,

పండిన కాస్త పంటకైనా గిట్టుబాటు ధర రాకపోవడం ఎరువులు, మందులు ఖర్చులు విపరీతంగా పెరిగి తీసుకున్న అప్పులు అలా ఏటికేడు పేరుకుపోయి ఆఖరికి వడ్డీకూడా కట్టలేని దుస్థితిలో పడ్డారు రైతులు. వరి వేస్తే నీరు లేదని మెట్ట పంటలు వేశారు. ఓ ఏడాది చీడపురుగువాత, ఇంకో ఏడు పంట కాస్తా బాగుందనేసరికి అకాల వర్షాలతో పట్టిన గింజ రాలిపోయి నీళ్ళల్లో తేలాయి. కంది మడులు, మిరప పంట, వేరుశనగ మార్చి మార్చి పంట వేసినా ప్రతి ఏడూ పెట్టిన ఖర్చన్నా గిట్టక అటు బ్యాంకుల్లో అప్పు, ఇటు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు పాపంలా పెరిగిపోయి లక్షన్నర దాకా అప్పుల్లో పీకదాకా మునిగాడు కొమరయ్య. అప్పుల బాధతో రైతులు మరోదారి లేక బతకలేక పురుగుల కోసం తెచ్చిన మందులు వాళ్ళు తాగి పురుగులు చావకపోయినా వాళ్ళు చచ్చారు. గత మూడేళ్ళుగా రైతుల ఆత్మహత్యల పర్వం మొదలైంది. అలా చచ్చిపోతే ప్రభుత్వం సహాయం అందిస్తుందని, డబ్బులిస్తారని ఆ డబ్బుతో కనీసం భార్యాబిడ్డలన్నా కడుపు నిండా తింటారని. బతికి బావుకుందే ముందని రైతులు ఒకరి తర్వాత ఒకరు ఆత్మహత్యలు మొదలెట్టారు. అలా ఆత్మహత్య చేసుకున్న వాళ్ళలో కొమరయ్య ఒకడు. మొగుడు నే చస్తానే, ఈ పురుగులు సావకపోయినా నే సావచ్చు తాగి... గవర్నమెంటోల్లు పైసలిస్తారంట. నీవు, ఎంకటేసు సుకంగ బతకొచ్చు' అంటూ దారి తెన్ను తోచక కొమరయ్య నిస్పృహారలో రెండు మూడు సార్లు అన్నప్పుడు 'ఊరుకోయ్యా పానం తీసుకుంటే నామీదొట్టే నన్ను సంపుకు తినమాకు. ఈ పొలం అమ్మేపారేయి వచ్చినకాడికి, మనం ఐదరాబాదు పోదాం. అక్కడ మస్తుగా కూలీలు మస్తుగా కావాలంట. సచ్చి సాదించేందయ్యా. అట్టాంటి ఆలోచన మాను. బేరం పెట్టు పొలం వచ్చినకాడికి అమ్మిపోదాం. భూమిని నమ్ముకు బతికే రోజులు కావియి." భార్యాభర్తలు చాలా రోజులు మథనపడి పొలం బేరం పెట్టారు. కానీ కొనే నాథుడే కనబడలేదు. ఊర్లో కామందు పరిస్థితి చూసి సగానికి సగం రేటు తగ్గించాడు. వచ్చినకాడికి అమ్ముదామన్న పొలం కాగితాలు బ్యాంకు దగ్గర తనఖాలో వున్నాయి. డబ్బు కట్టి కాగితాలు తీసుకెళ్ళమన్నారు. పొలం అమ్మి డబ్బు బ్యాంకికి కట్టేటట్టుగా వాళ్ళ ఆఫీసరు ముందు రాతకోతలు జరగాలన్నారు. దానికీ ఒప్పుకొని బేరం పెట్టి అమ్మాడు. బ్యాంకికి డబ్బు కట్టగానే, పొలం అమ్మిన సంగతి తెలిసి అప్పులిచ్చిన వడ్డీ వ్యాపారులు చుట్టుముట్టారు. 'ఏందిరా తెలివి మీరావు. అప్పులంటూ కాళ్ళావేళ్ళా పడి డబ్బులుచ్చుకొని చెల్లుబడి సేయకుండా పొలం అమ్ముకుని గప్‌చుప్‌గా పోదామని సూస్తండవా? మా డబ్బులక్కడ ఎట్టి

కదులు. లేకపోతే మెడమీద తలకాయుండదు. అదిరించి, బెదిరించి గుండాలని పట్టుకొచ్చి ఎవరికి రావాల్సిన డబ్బులు వారు గుంజుకుపోయారు. అన్నీ పోగా చేతిలో మిగిలిన మూడు వేలు చూసుకుని వెర్రివాడిలా మాట పలుకు లేకుండా మిడిగుడ్లేసుకు కూర్చున్నాడు. మల్లమ్మ నెత్తీ నోరూ బాదుకుని కేకలు పెట్టింది. ఇరుగు పొరుకు పొలం అమ్మి తప్పుచేశారని తలో మాటా అని పోయారు. ఆ రాత్రే పురుగుల మందు తాగిన కొమరయ్య తెల్లారేసరికి గుడిసెలో చచ్చిపడి వున్నాడు. మొగుడ్ని తగలెట్టడానికి సేతిలో దబ్బులుంచావయ్యా దేముడో అంటూ ఏడ్చింది మల్లమ్మ.

పరామర్శకొచ్చిన పిన్నమ్మ భూదేవి పరిస్థితి అర్థం చేసుకుంది. 'ఇంక యీడ ఏం తిని బతకతావు? పోరిగాడ్నెట్టుకు ఎలా బతకతావు? ఐదరాబాదు వచ్చేయి, నాలుగిండ్లలో గింత పాచిపని చేసన్నా బతకచ్చు. ఈడ కూలిపని కూడా నీకు దొరకదు గదా' అంటూ తనతో ఐదరాబాదు ప్రయాణం కట్టించింది. వండుకునే గిన్నెలు, కట్టుకునే బట్టలతో, చేతిలో వెయ్యి రూపాయలతో మహాపట్నానికి వచ్చి చేరింది. భూదేవి కొమరయ్య పురుగుల మందు తాగి చచ్చాడన్న సర్టిఫికెట్టు సంపాదించి, ఆత్మహత్య చేసుకున్న రైతులకిప్పించే సాయం అందాలని అర్జీ పెట్టించింది పంచాయితీ ఆఫీసులో. "ఆడబ్బు వచ్చేదో పోయేదో దేముడి కెరుక ఈడుండి పస్తులుండి మాడి సావద్దు" అంటూ తీసికెళ్ళి ఓ బంగళాలో ఐదొందలకి పనికి కుదిరించింది.

"మా అపార్టుమెంటులో సానా ఇల్లున్నాయి. ఎవరన్నా అడిగితే ఇంకో రెండిల్లు సేసుకుందువుగాని, ఏదోవిధంగా బతకనేకపోవు' అంటూ ఓదార్చింది. మూడిళ్ళలో పనిచేసుకుంటూ, యీ అమ్మ ఆ అమ్మ యిచ్చే చాయ నీళ్ళు తాగి, వారు పెట్టింది తిని ఇచ్చింది తెచ్చుకుని తల్లీ కొడుకులు బతుకీడ్చసాగారు.

* * * * * *

'మావకాడ కూకుని అచ్చరాలు రాపించుకో. అరే, ఈడిని కాస్త నీకాడ కూకుండబెట్టు' తమ్ముడి కప్పగించి పనులకి పోయింది మల్లమ్మ. ఎంకటేసుకి ఆ లిఫ్టులో కూర్చోడమే బతుకు ధన్యమైనంత ఆనందంగా వుంది. వచ్చే పోయేవాళ్ళని చూస్తూ యాదగిరితో ఈ మాటా ఆ మాటా చెప్పుకుంటూ కూర్చోడం బలే సరదాగా వుంది. 'ఏందిరా మొగం సింకిసాటంతయింది. రెండు రోజులు యిందులో కుకుంటే బోరుకొడ్తది. బోనులో వున్నట్టుంది నాకు. ఎటూ పోదారికి వుండదు. చాయ టైముకు

పదినిముషాలు, భోజనానికి గంట మధ్యలో సెలవంతే. తలుపు గుంజి గుంజి సేయి నొప్పేస్తది. ఒకటే ఉడకపోత ఫేనేస్తే సెక్రటరీ జూసిందంటే తిడ్తడు' తన కష్టం చెప్పుకున్నాడు. మొదట్లో కొన్నాళ్ళు మజాగా అనిపించింది. ఇప్పుడు సిరాకు పుడ్తుంది. ఎక్కడైనా వాచ్‌మెన్ కొలువు దొరికితే పోతా. చక్కగా వాచ్‌మెన్ బయట గేటుకాడ కుర్చీ వేసుకుని కూచుని వచ్చిపోయేవాళ్ళతో కబుర్లాడడం తనేమో ఖైదులో వున్నట్టు కదలడానికి లేదని వాచ్‌మెన్ ఉద్యోగం చెయ్యాలని యాదగిరి ఆశ. లిఫ్టులో బోరు అంటున్న యాదగిరిని వింతగా చూశాడు వెంకటేసు. 'రాయరా, మీ అమ్మ తిడ్తది. అచ్చరాలు రాసిచ్చినాగా దిద్దు కూకుని' అన్నాడు. మావా నాకు నేర్పవా లిఫ్టు నడిపేది' ఆశగా చూశాడు. 'ఏందిరా నేర్పేది సిన్నపిల్లలు సేసే పనా యిది. నా అంత అవు, అప్పుడు చేద్దువులే ఈ నౌకరీ. ముందసలు అచ్చరం ముక్కలు, అంకెలు నేర్చు అన్నాడు. నవ్వి వెంకటేసు పలక మీద అంకెలు దిద్దక ముందే లిఫ్టులో నంబర్లు గుర్తుపట్టేశాడు. అ ఆ లు దిద్దుతున్నా వాడి దృష్టి అంతా యాదగిరి నొక్కే లిఫ్టు బటన్ మీద వుండేది. 'మూడో ఫ్లోరు ఎలిగింది మావా' అనేవాడు ఎర్రలైటు వెలగ్గానే యాదగిరి వాడి యింటరెస్ట్ చూసి 1 నంబరు ఫస్ట్ ఫ్లోరు, రెండు సెకండ్ ఫ్లోర్ అంటూ చెప్పేవాడు. ఓరోజు అన్నింటికంటే పై అంతస్తులో లిఫ్టు తిరిగే మిషను చూపించాడు. ఓ రోజు లిఫ్ట్ కరెంట్ పోయి మధ్యలో ఆగిపోయింది. అప్పుడు తన దగ్గరున్న యినప చువ్వతో లిఫ్టు దగ్గర గోడకున్న చిన్న కన్నంలో పెడితే తలుపు తీస్తే ఇద్దరూ స్టూలెక్కి బయటికి వచ్చారు. వారం పదిరోజులు అన్నీ గమనిస్తూ 'మావా నీవు స్టూలు మీద కూకో, సూడు నేను నడిపిస్తా' అని సరదాపడ్డాడు. ఎర్రలైటు వెలగ్గానే సెకండ్ ఫ్లోర్ అని రెండో బటన్ నొక్కి తలుపులు వేయడం తీయడం అంతా సరదాగా వుండేది. నెల రోజులు లిఫ్టులో కూర్చోగానే నడిపే మెలకువలన్నీ నేర్చుకున్నాడు. అక్కా యీడికి బలే బుర్రుందే. బలే నేర్చేశాడు అన్నాడో ఓ రోజు. నాలుగచ్చరం ముక్కలు నేర్పరా అంటే లిఫ్టు నడిపేది నేర్పావు. మల్లమ్మ నవ్వింది. 'మావా నీవు వాచ్‌మెన్ ఉద్యోగానికి వెళితే నేనీ లిఫ్టు నడుపుతా' గర్వంగా అన్నాడు వెంకటేసు.

'పోరా ఎదవకానా ఇంతున్నావు నీకెవడిస్తాడు ఉద్యోగం? ముందు పెద్దోడివికా, అచ్చరం, అంకెలు నేర్చు స్కూలికి పో' అయ్యాయంగా మందలించాడు. ఎప్పటికైనా, పెద్దయ్యాక లిఫ్టులో కూర్చోవాలి, నడపాలి అన్న కోరిక రోజు రోజుకీ పెరిగింది కాని తరగలేదు వెంకటేసుకి.

కానీ ఏ రోజు ఆ లిఫ్టు సరదాయే తన జీవితంలో నరకం సృష్టిస్తుందని వెంకటేసుకి తెలియదు.

ఓరోజు పదకొండు గంటల వేళ యాదగిరి టీ తాగి వచ్చే టైము. యాదగిరి లిఫ్టు ఆటో మేటిక్‌లో పెట్టి చాయ్ తాగడానికి వెళ్ళాడు. వెంకటేసు లిఫ్టు బయట వరండాలో నిలబడి పిల్లల ఆటలు చూస్తున్నాడు. మూడో ఫ్లోర్‌లో లిఫ్టు నిలబడి వుంది. ఎవరో లిఫ్టు నొక్కుతున్నారు. తలుపు సరిగా మూయకపోవడంతో లిఫ్టు కదలడంలేదు. చప్పుడవుతూంటే వెంకటేసు చూశాడు. తలుపు సరిగా మూయకపోవడంతో లిఫ్టు కదలడంలేదు. చప్పుడవుతూంటే వెంకటేసు చూశాడు. తలుపు సరిగా మూయకపోతే లిఫ్టు కదలదన్నది వాడికి తెలుసు కనక తలుపు దగ్గరకెళ్ళి లోపలి వైపు తలుపులో చెయ్యి పెట్టి సరిగా కనెక్ట్ అయ్యేట్టు తలుపు లాగాడు. వాడు చెయ్యి లాగే లోగానే పైనించి ఎవరో నొక్కడంతో లిఫ్టు పైకి లేచింది. వెంకటేసు చేతికున్న రాగి గాజు గ్రిల్లుకి అడ్డంపడి చేయి తొందరగా లాక్కోలేక పోయాడు. అంతే లిఫ్టుతోపాటు చేయి యిరుక్కున్న వెంకటేసు కాళ్ళు నేలమీద నుంచి లేచి వేళ్ళాడుతూ కేకలు పెట్టాడు. వాడి కేకలకి వాచ్‌మెన్, టీ తాగడానికి వెళ్ళిన యాదగిరి చుట్టూ ఆడుకుంటున్న పిల్లలు, పెద్దలు హాహాకారాలు చేస్తూండగానే మూడో ఫ్లోర్ నుంచి నాలుగో ఫ్లోర్‌కి లేచిన లిఫ్టు వెంకటేసు చేతిని కూడా తీసుకుని పైకి వెళ్ళింది. నాలుగో ఫ్లోరు సీలింగ్‌కి వాడి తల బలంగా తగలడం, యిరుక్కున్న వాడి చేయి మణికట్టు వరకు తెగి లిఫ్టులో పడి లిఫ్టు ఐదో ఫ్లోరుకి వెళ్ళి ఆగడం, తల కొట్టుకుని వెంకటేసు తెలివి తప్పి కిందపడడం, నెత్తుర్మడుగు, హాహాకారాలు అందరూ గబగబా వచ్చి తెగిపడిన చేయి ప్లాస్టిక్ కవర్‌లో వేసి, రక్తం కారిపోతున్న వెంకటేసు చేతిని ఓ చీరలో చుట్టి దగ్గరలో ఉన్న ఆస్పత్రికి మోసుకుపోయారు. ఇంట్లో పని చేస్తున్న మల్లమ్మ గోలకి బయటికివచ్చి జరిగింది చూసి తెలివితప్పి పడిపోయింది. దగ్గర ఆస్పత్రివాళ్ళు ప్రథమచికిత్స చేసి పెద్దాసుపత్రికి తీసుకుపొమ్మన్నారు.

నెలా పదిహేను రోజుల తర్వాత ఆస్పత్రి నుంచి వెంకటేసు బయటపడ్డాడు. కుడి చేయి మణికట్టు వరకు లేకుండా తెగి పడిన చేయి ఆస్పత్రిలో నాలుగు గంటలు ఆపరేషన్ చేసి అతికించారు. నాలుగు సీసాల రక్తం ఎక్కించారు. నలిగి నుజ్జు అయిన ఎముక చిన్న ముక్క కోసి తీసి తెగి, చితికిన నరాలు కలిపి కుట్టి డాక్టర్లు చెయ్యాల్సిందంతా చేశారు. ఆపరేషన్ సక్సెస్ కాలేదు. గాంగ్రిన్ డెవలప్

అవడంతో తెగినంత మేరా చెయ్యి తీయక తప్పలేదు. మొండిచెయ్యితో బతికి బయటపడిన కొడుకుని చూసి మల్లమ్మ ఏడుపుకి అంతే లేదు. తల సీలింగ్‌కి గుద్దుకోవడం వల్ల మెదడు బాగా అదురికి గురి అయి అసలు రెండు రోజులు స్పృహలోకే రాలేదు. ఆ దెబ్బవల్ల వాడికి కాస్త జ్ఞాపకశక్తి తగ్గడం, ఎవరన్నా ఏదన్నా చెప్పినా అర్థం కావడానికి టైము పట్టేది. అదోరకంగా వెర్రి చూపు చూస్తున్నాడు. 'ఓరి నాబిడ్డో, నీకిదేం గతిరో దేముడా, బగమంతుడింత అన్నాయం సేసాడో దేముడో!' కట్టుకున్నాడు లవంతం చావు సచ్చాడు. దేముడు బతికుండగానే సచ్చినోడితో సమం చేశాడురో నిన్ను. సేయి లేకుండా ఎట్లా బతకతాడు ఏటి సేస్తాడు. దేముడో నా బతుకు యిట్టా సేసిండో ఏదో బతుకు దారి లేక యీడకొస్తే ఆడి బతుకే చిందర చేశావురో... పల్లెటూరిలో వుంటే ఆడి బతుకు యిలా అయ్యేది కాదు. దేముడో, మల్లమ్మ దుఃఖం ఎవరూ తీర్చలేనిది. అపార్టుమెంటు వాళ్ళంతా తోచిన డబ్బు సాయం చేశారు. సానుభూతి చూపారు. అంతకంటే ఎవరేం చెయ్యగలరు? ఆ కొడుకు భవిష్యత్తు తలుచుకుంటూ మల్లమ్మ తల్లడిల్లాల్సిందే బతుకంతా.

దుఃఖం వెనకబడి రోజులు ముందుకెళ్ళాయి. వెంకటేసు బడిలో చేరడం వాయిదా పడింది. చేయి పుండు మాని, వాడి పిచ్చి చూపుల ధోరణి కాస్త తగ్గి వాడు మళ్ళీ మనుషుల్లో పడడానికి అర్నెల్లు పట్టింది. వంటి చేత్తో ఎడం చేత్తో పనులు చేసుకోడానికి అలవాటుపడ్డాడు. వాళ్ళమ్మ పని చేసుకుంటుంటే అలా మెట్లు మీద కూచునేవాడు. యాదగిరి లిఫ్టు పని మాని ఎక్కడో వాచ్‌మెన్ ఉద్యోగానికి కుదురుకున్నాడు. ఆ తరువాత యిద్దరు లిఫ్టు బాయ్‌లు వచ్చినా తలో నెలరోజుల పని చేసి మానేశారు. లిఫ్టు ఆటోమేటిక్‌గా నడుస్తోంది. మల్లమ్మ కొడుక్కి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది లిఫ్టు వైపు వెళ్ళరాదని. ఆ జరిగిన సంఘటనతో బిల్డింగ్ అసోసియేషన్ వారు పిల్లలు దగ్గరకి వెళ్ళకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులది అని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

ఏడాది గడిచింది. మల్లమ్మ ఆర్థిక పరిస్థితి చితికిపోయింది. పెద్దాసుపత్రిలో ఆపరేషను ఫ్రీగా చేసినా మందులు మాకులు, నెలరోజులు ఆస్పత్రి తిరిగిన ఖర్చులు, టెస్టులు అన్నీ కలిపి పది, పదిహేను వేలు అప్పులు చేయాల్సి వచ్చింది. దానికి తోడు నెల రోజులు పనికి సరిగా వెళ్ళకపోవడంతో రెండిళ్ళవాళ్ళు కొత్త మనిషిని పెట్టుకున్నారు. రెండిళ్ళే మిగిలాయి. డబ్బుకి కటకట. కొత్త ఇల్లు దొరకలేదు. ఓపూట తిని ఓ పూట తినక మనసులో బెంగతో చిక్కి శల్యమైంది. భవిష్యత్తు

భూతంలా భయపెడుతుంది. కొడుకుని చదవించాలని కన్న కలలు కల్లలయ్యాయి. వాడంతటవాడు ఏ పని పడితే ఆ పనికి రాడు. బెంగతో నిద్రాహారాలు కరువయ్యాయి మల్లమ్మకి.

మరో ఆర్నెల్లు గడిచాక వెంకటేసు కళ్ళలో బెదురు, ఆ తెల్ల మొహం చూపులు తగ్గి కళ్ళలోకి కాస్త కళ వచ్చింది. ఉన్నట్టుండి ఏ రోజు 'అమ్మా లిఫ్టు నడిపే ఉద్యోగం చేస్తానే. సార్‌తో మాట్లాడే మనకి డబ్బుల్లేవు. నీ వొక్కతివి ఎంత కష్టపడతావు. నేనూ నౌకరి సేస్తా. ఈ పని యిప్పించమని అయ్యగార్లని అడగవే అన్నాడు. మల్లమ్మ తెల్లబోయింది. 'ఓరి నా కొడకా, మళ్లీ ఏందిరా లిఫ్టు అంటావు. సావాలనుందేట్రా? కలో గంజో తాగుదాం. లిఫ్టు దెయ్యంరా. అది భూతంరా, నిన్ను మింగతది యీసారి. దాని జోలి వద్దురా మనకు. కొడుకుని కౌగలించుకుని భోరుమంది మల్లమ్మ. ఆ ఏక్సిడెంటు తరువాత మల్లమ్మ మళ్ళీ లిఫ్టు ఎక్కలేదు. నడిచే వెళ్ళేది. 'కాదే అమ్మా నాకేం కాదే ఇప్పుడు సూడు ఎట్టా కూకుని నడుపుతానో, నాకేం బయం లేదు. అమ్మా, ఈపని సేసేయగలనే. నేను స్కూలికి పోను.'

'వద్దురా, సదుకోరా, ఇప్పటికాడ నించి నౌకరి ఎందుకు, సదుకో. పదేల్ల పిల్లగాడికి ఎవరిస్తారు ఉజ్జోగం.'

'అమ్మా ఎడం సేత్తో రాయడం నావల్ల కాదే. నాకసలు అచ్చరాలు, అంకెలు రావే'. ఇంట్లో తల్లి మామయ్య అందరూ వీడి బుర్రకి దెబ్బతగిలింది. ఈడేం చదూతాడు అంటూ మాట్లాడుకోడం విన్నాడు. ఎడం చేత్తో పెన్సిలు పట్టి అసలు రాయను రావటం లేదు. దాంతో వాడికి చదువు మీద అసలు బుద్ధిపోవడం లేదు. 'అమ్మా లిఫ్టు ఉద్యోగం సేసే యాదగిరి మామకి పన్నెండొందలు ఇచ్చారు గందా. నాకందులో సగం ఇమ్మనే. అందులో బల్లమీద కూకుని కట్టపడకుండా డబ్బులు సంపాదిస్తా' ఆశగా అడిగాడు. మల్లమ్మ ఆలోచనలో పడింది. పిన్నమ్మ, యాదగిరి సలహా అడిగింది. 'యీ పోరడు సేస్తానన్నా అల్లు పెట్టుకోవద్దా, పదేళ్ళ వాడిని పనికెవరెట్టుకుంటారు. పోనీ అడిగి సూడు, ఆడన్నట్టు వంటి చేత్తో కట్టపడకుండా కూకుని నాలుగు రాళ్ళు సంపాదిస్తే నీకు తోడవుతాడు. ఆడికో బతుకు తెరువుండాలి కందా' అన్నారు.

తను పనిచేస్తున్న ఇల్లాళ్లకి చెప్పి బిల్డింగ్ సెక్రటరీకి చెప్పించింది మల్లమ్మ. 'అదెట్లా, అసలే వాడు లిఫ్టులో చెయ్యిపెట్టి అప్పుడు నెత్తిమీదకి గొడవ తెచ్చాడు.

పదేళ్ళవాడిని పనికి పెట్టుకుంటే చైల్డ్ లేబర్ యాక్ట్ కింద మమ్మల్ని జైల్లో వేస్తారు' అంటూ ఒప్పుకోలేదు. "బాబ్బాబు, అట్టా అనబోకండి, ఆడికి అచ్చరం ముక్క రావడంలేదు. వంటి సేత్తో ఏ పని సేయగలడు? వంటరి ఆడదాన్ని, బోలెడు అప్పుల్లో మునిగాను. ఈ లిఫ్టు ఆడిపాలిట అమ్మోరు అయి ఆడి సేయి బలి గోరింది. ఇప్పుడింక ఆడ్ని ఆ తల్లే సల్లగా సూస్తుంది. ఆడికి పనిప్పించండి దొరా. ఆడికి ఏం జరిగినా మీకు మాట రానీయను. ఆడిది అసలు ఉజ్జోగం న్నద్దు. మీరెంత ఇచ్చినా మాకు కొండంత అండ. బల్లమీద కూకోపెట్టండి. ఈ బిల్డింగే యింక ఆడికి తల్లి. మీరే ఇంత బతుకు తెరువు సూపాలి అని కాళ్ళు పట్టుకు ఏడ్చింది. అసోసియేషన్ వాళ్ళు మాట్లాడుకున్నారు. తమ బిల్డింగ్‌లోనే వాడికి అన్యాయం జరిగింది. మానవతా దృక్పథంతో ఏదో విధంగా వాడిని ఆదుకోవాలని వారిలో వారు చర్చించి నిర్ణయించారు. 'బానే వుంది కానీ, పిల్లలచేత చాకిరీ చేయించడం నేరం. ఎవరికన్నా తెలిస్తే...' 'ఏటి బాబూ అమ్మ పెట్టదు, అడుక్కు తిననీయదంటారు. పూట గడవని మాలాంటోరు ఏం తిని బతుకుతాం? గవర్నమెంటోళ్ళు పిల్లలకి కూకోపెట్టి తిండెడతారా? పిల్లలని కట్టబెట్టాలని మాకుంటుందా? తిండే లేకపోతే సదూలు సట్టబండలు ఏటి బాబూ, మీరు దయ సూపకపోతే ఆడికి బతుకుతెరువు నేదు బాబూ. లిఫ్టులో సుళువులన్నీ నేర్చుకున్నాడు ఆడు. మీకు తోచినంత యిచ్చి ఆడ్ని అందులో కూకోపెట్టండి బాబూ. మల్లమ్మ మాటలకి ఏ ప్రభుత్వమూ జవాబు చెప్పలేదు. చైల్డ్ లేబర్ వద్దన్నప్పుడు దాని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా పిల్లలని కూర్చోబెట్టి పోషించడం పూట గడవని వారికి సాధ్యమా అన్నది ప్రభుత్వాలు ఆలోచించాలి గదా!

వెంకటేసుకి రెండు మూడు రోజులు లిఫ్టు గురించి చూపించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పి నెలకి ఎనిమిది వందలు జీతంకి కుదిర్చారు.

లిఫ్టులో కూర్చుని పైకి ఎక్కుతూంటే వెంకటేసు మొహంలో సంబరం చూసి 'బగమంతుడు ఏదో దారి సూపాడు, పుట్టించినా గిట్టించినా అన్నీ ఆడికే ఎరుక' అని దండం పెట్టుకొని కళ్ళు తుడుచుకుంది మల్లమ్మ.

(ప్రియదత్త సకుటుంబ వారపత్రిక, 29.6.2005)